# ఒంటెద్దుబండి

'శ్రీకంఠస్ఫూర్తి'



సిరిపల్లె జంక్షనులో ఆర్టీసీ బస్సు ఒక్క క్షణం అలుపు తీర్చుకోవడానికా అన్నట్టు ఆయాసపడుతూ ఆగింది.

కండక్టరు కేకతో సుందరం సూట్‌కేస్ పట్టుకుని గబగబా బస్సు దిగాడు.

బస్సు దుమ్ము రేపుకుంటూ ముందుకు పరుగు తీసింది.

సాయంత్రం అయిదున్నర. శీత కాలం పొద్దులో సూర్యుడు పడమటి కొండల్లోకి త్వరత్వరగా జారిపోతున్నాడు.

సుందరం అయోమయంగా రోడ్డు మీద నిలబడి చుట్టూ కలయచూశాడు.

ఆ జంక్షను మధ్య ఎత్తైన రావిచెట్టు ఒకటి శాఖోపశాఖలుగా విస్తరించుకుని ఉంది. చెట్టు మీద గుంపులుగా కొంగలు రెక్కలు టపటపలాడిస్తూ గోలగా అరుస్తున్నాయి. చెట్టు క్రింద చిన్న తాటాకుల పాక ఉంది. పాకలోంచి పొగ బద్ధకంగా పైకి లేస్తోంది. పాకలో ఎవరో మనుషులున్నట్టుగా అలికిడి వినబడుతోంది.

"సిరిపల్లెకు ఎదురుగా కనిపించే ఎర్రటి కంకర రోడ్డేనా దారి? ఎవరిని అడగాలి? ఎలా వెళ్ళాలి? ఆ పాకలో మనుషుల్ని అడిగితే సరి." సుందరం సాలోచనగా ఒక అడుగు ముందుకు వేయబోయి ఎవరో పిలిచిన ట్టనిపించి చటుక్కున వెనక్కి తిరిగాడు.

"బాబూ! ఒంటెద్దుబండి ఉందయ్యా! సిరిపల్లె పోదాం వత్తారా!"

సుందరం, తన పక్కనే చేతులు కట్టుకుని నిలబడ్డ ముసలి తాతను పరీక్షగా చూస్తూ కొద్ది క్షణాలు మాట్లాడలేదు.

ఎభై, అరవై ఏళ్ళ మధ్య వయసు. తెల్లటి గడ్డం, గుబురు మీసాలు, మాసిన పొట్టి చేతుల చొక్కా, మల్లు పంచె. వృద్ధాప్యం మీదపడ్డా ఆ భారాన్ని అతి తేలికగా మోస్తున్నందుకు నిదర్శనంగా ముడతలు పడ్డ ముఖంలో ఉబికి వచ్చే ఉత్సాహం.

సుందరం తాత నుంచి దృష్టిని మరల్చి రావి చెట్టుకు ఎడంగా నీడలో నిలబెట్టిన ఒంటెద్దు గూడు బండిని నిరాసక్తంగా చూశాడు.

"హతవిధీ! ఒంటెద్దుబండిలో ప్రయాణమా? వేరే దారి లేదా? కారు కాదు, ఆటో కాదు, రిక్షా కాదు .. కనీసం గుర్రంబండీ కూడా కాదు. ప్రపంచం మనోవేగంతో పోటీపడి పరుగుపెడుతుంటే ఇంకా ఈ పల్లెటూళ్ళలో ఒంటెద్దు బండి ప్రయాణాలు తప్పవా?" సుందరం మనసులో విసుక్కున్నాడు. అమ్మ వద్దంటున్నా బయలుదేరినందుకు తనను తాను తిట్టుకున్నాడు.

"తాతా! సిరిపల్లె ఇక్కడకు ఎంత దూరం ఉంటుంది?"

"అఁ ఎంత బాబూ! ఎనిమిది మైళ్ళు. తవర్ని గంట తిరక్కుండా ఊళ్ళో దింపే పూచీ నాదీ. రండి బాబూ! బం డెక్కండి!" ముసలి తాత నవ్వుతూ మాట్లాడుతూనే తన ఒంటెద్దు బండిని నడిపించి తీసుకొచ్చి సుందరం ముందు నిలబెట్టాడు.

సరే! ఇక తప్పేది లే దనుకుంటూ సుందరం సూట్‌కేసు బండి లోపల పడేసి తనూ ఎక్కి కూర్చున్నాడు. బండిలో చిరుగులు పట్టిన ఈత ఆకుల చాప ఉంది. చాప క్రింద పరచిన ఎండు గడ్డి వల్ల కూర్చోవడానికి మెత్తగానే ఉంది. పైన గూడు తడికె మాత్రం, చివికిపోయి నల్లటి ధూళి నెత్తిమీద రాలుతోంది. తాత చుట్ట వెలిగించుకున్నాడు. తాపీగా బండెక్కి ఎద్దును అదిలించాడు. ముసలి ఎద్దు ముక్కుతూ, మూలుగుతున్నట్టుగా ఒక అడుగు ముందుకు వేసి ఆగిపోయింది. తాత కోపంతో బండి దిగాడు. ఎద్దు తోకను గట్టిగా సులిపెట్టి వదిలాడు. ముల్లు కర్రతో పొడిచి "హెయ్, హెయ్" అంటూ అరిచాడు. ఎద్దు కదిలింది. బండి బయలుదేరింది. ఎర్రటి కంకర రోడ్డు. గతుకులు గతుకులుగా ఉంది. బండి గతుకుల్లో పడినప్పుడల్లా సుందరం పైకీ, కిందకీ ఎగిరిపడుతున్నాడు.

ముసలి ఎద్దు భారంగా బండిని లాగుతోంది. ఎద్దు శ్రమకు గుర్తుగా మెడలో గంట ఎడతెరిపి లేకుండా మోగుతోంది.

రోడ్డుకు ఒకవైపుగా మామిడి, జీడి మామిడి తోటలు జీబురుగా పెరిగి ఉన్నాయి. మరో వైపు పచ్చటి పంట పొలాలు. పొలాల్లోకి పాయలుగా నీళ్ళు ప్రవహిస్తున్నాయి. పొలం గట్ల మీద పిచ్చుకలు గిరికీలు కొడుతూ ఎగురుతున్నాయి.

సుందరం ఆసక్తిగా పరిసరాల్ని పరికిస్తున్నాడు. మునిచీకట్లు ముసురుకున్నాయి. కర్మసాక్షి పూర్తిగా కనుమరు గయిపోయాడు.

"ఏ ఊరి నుంచి వత్తన్నారు బాబూ?"

"హైదరాబాదు."

"సిరిపల్లెలో ఎవ్వ రింటి కెల్తారు బాబూ?"

"పరిగెల చలమయ్య గా రింటికి."

తాత గిరుక్కున వెనక్కి తిరిగి సుందరం ముఖంలోకి చూశాడు. కుర్రాడు అమాయకంగా, అందంగా ఉన్నాడు. లేత మొహం, మూతి మీద మీసాలు ఇప్పుడిప్పుడే మొలుస్తున్నాయి. వయసు పద్దెనిమి దేళ్ళు దాటవు. ఎవరి బిడ్డో!

"సిరిపల్లెలో చలమయ్య గారు మీ కే టవుతా రయ్యా?" తాత ఆత్రంగా అడిగాడు.

"మా తాతగారే! ఆయనకు ఒంట్లో బాగాలేదని టెలిగ్రామ్ వచ్చింది. నాన్నగారు తప్పనిసరిగా టూరు వెళ్ళాల్సి వచ్చింది. నేనైనా కాలేజీకి సెలవు పెట్టి అమ్మ వద్దంటున్నా వినకుండా తాతగారిని చూడా లని బయలుదేరి వచ్చాను. మా తాతగారు నీకు తెలుసా? ఆయన కెలా ఉంది? తెలిస్తే చెప్పవూ?" సుందరం ఆందోళనగా ప్రశ్నలు వేశాడు.

తాత ముఖంలో రంగులు మారాయి. "చలమయ్య గారు నాకు తెలవకపోవడం ఏటి బాబూ! ఆ బాబుండే యీది సివరే నా గుడిసె కూడా ఉంది. కనిపించినప్పు డల్లా కబుర్లాడుకుంటాం. కట్టసుకాలు సెప్పుకుంటాం." తాత గొంతులో విషాదం తొంగి చూసింది.

"మా తాతగారు చాలా మొండి మనిషట. నాన్నగారికి చాలా కోపం ఎన్నిసార్లు ఆ ఊరు విడిచిపెట్టి రమ్మన్నా రాలేదని. సరేలే! ఆయన ఆరోగ్యం ఎలా ఉం దిప్పుడు?" సుందరం బండిలో ఇబ్బందిగా ముందుకీ, వెనక్కీ కదులుతూ అన్నాడు.

"ఎలా సెప్పను బాబూ! ఆ మాట నీ కెలా సెప్పనూ? నా నోట్లోంచి మాట రావటం లేదు." బండి తాత కంఠం దుఃఖంతో పూడుకుపోగా ముఖం వెనక్కి తిప్పుకున్నాడు.

"ఏం జరిగింది తాత? మా తాతగారి కేమైంది?"

సుందరం గుండె దడదడా కొట్టుకుంది.


"మూడ్రోజు లయినాది బాబూ చలమయ్యగారు మట్టిలో కలిసిపోయి. ముగ్గురు కొడుకు లుండి కూడా దిక్కులేని సావు బగమంతుడు నొసట్న రాసినట్టున్నాడు. ఊళ్ళో పెసిడెంటూ, పెద్దలూ కలిసి ఆ బాబుని బూడిద సేసేసినారయ్యా!" బండి తాత ఒళ్ళు ఒత్తుకున్నాడు.

"తాతగారు పోయారా! నిజమే." సుందరం అదిరి పడ్డాడు. తల పట్టుకుని వెనక్కి వాలిపోయాడు. అతని కళ్ళల్లో నీళ్ళు సుళ్ళు తిరిగాయి. ఒళ్ళంతా వణుకు, బాధ.

"తాతగారిని తను చిన్నప్పు డెప్పుడో చూశాడు. ఆయన రూపం కళ్ళల్లో లీలగా మెదులుతోంది. ఈ మధ్య కాలంలో ఆయన్ని చూడటం పడలేదు. తాతగారు హైదరాబాదు ఎప్పుడూ రాలేదు. ఆయ నిలా హఠాత్తుగా పోతా రని ఊహించలేదు. ఇంట్లో కూడా ఎవరూ అనుకోలేదు.

వారం రోజుల క్రితం తాతగారికి అసలు ఒంట్లో బావుండలేదని టెలిగ్రామ్ వచ్చింది. ఆ టెలిగ్రామ్ చూసి నాన్నగారు ఆలోచనలో పడ్డారు. అప్పుడు అమ్మ కలగజేసుకుంది - "ఆయన కి దేం కొత్త కాదు. అర్థంటు ఉత్తరాలు రాయడం. అసలు ఒంట్లో బాగాలేదని టెలిగ్రామ్ లిప్పించడం ఆయనకు అలవాటే. మీరు ఢిల్లీ కాంపు మానుకోవద్దు. నిరభ్యంతరంగా వెళ్ళిరండి. అవతల బెజవాడలో ఒక కొడుకూ, కాకినాడలో ఒక కొడుకూ ఉన్నారుగా వాళ్ళకీ పెద్దాయన టెలిగ్రాము లిప్పించే ఉంటాడు. మీరు వెళ్ళి రండి" అంటూ అమ్మ నాన్నకు సర్దిచెప్పి ఢిల్లీ పంపించివేసింది.

ఆ తరువాత రెండు రోజులకి కాబోలు - బెజవాడ బాబాయి నుంచి, కాకినాడ చిన్నాన్న నుంచీ నాన్నకు ఉత్తరా లొచ్చాయి. అన్నయ్యా! మేము ఏవో ముఖ్యమైన పనుల్లో మునిగిపోయాం. సిరిపల్లె నాన్న దగ్గరకు నువ్వు వెళ్ళి ఉంటా వనే భావిస్తున్నాం - అంటూ ఆ ఉత్తరాల సారాంశం. ఆ ఉత్తరాలు చూసి తనకు మనసు చెదిరింది. అమ్మ



వద్దంటున్నా వినకుండా తాతగార్ని చూడాలని తను బయలుదేరాడు. కానీ తాతగారు ...

సుందరానికి దుఃఖం తెరలు తెరలుగా ఉబికి వస్తోంది.

"తాతా! నీ పేరేమిటి?" సుందరం దుఃఖోద్వేగాన్ని ఆపుకుంటూ అడిగాడు.

"మునలయ్య బాబూ!"

"చూడు మునలయ్యా! బండిని వెంటనే వెనక్కి తిప్పు. నేను హైదరాబాదు తిరిగి వెళ్ళిపోతాను. తాతగారు లేని ఆ ఊరు వెళ్ళడం ఎందుకు?"

సుందరం గబుక్కున బండి దిగబోయాడు.

"ఆగండి బాబూ! తొందరపడిపోకండి. తవ రిప్పుడు ఎనక్కెల్లినా ఏ బన్సూ దొరకదు. మీ తాతగారు ఆ ఊళ్ళో లేకపోయినా ఆ బాబు కాలం సేసిన ఇల్లుంది కదయ్యా! ఆ ఇంటి కెళ్ళి ఊళ్ళో పెద్దలకి ఒకపాలి కనవడి రే పొద్దుట్నే ఎల్లిపోతే బాగుంట దయ్యా! ఆ పైన తవ రిట్టం."

మునలయ్య సలహా విని సుందరం మౌనంగా ఉండిపోయాడు.

తాత ఎద్దును రెండు దెబ్బలు కొట్టి వేగంగా ముందుకు అదిలించాడు. చుట్టూ చీకటి చిక్కబడింది. ఆ చీకట్లో గతుకుల రోడ్డు మీద మునలి ఎద్దు కుంటుతున్నట్టుగానే అడుగులు వేస్తోంది. తాత దెబ్బలు కొట్టినా దాని నడకలో మార్పు లేదు.

"దిగులు పడకు నాయనా! కొడుకు ల్రాకపోయినా, మనవడివి మన సెట్టుకుని వచ్చినావు! ని న్నయినా నూనుకునే అదురుట్టం దక్కలేదు చలమయ్య బాబుకి." మునలయ్య నుందరాన్ని ఓద్దారుస్తూ అన్నాడు.

"మునలయ్యా! మా తాతగారు మొండిగా ఈ ఊళ్లోనే ఎందుకు ఉండిపోయా రంటావ్? మా నాన్నగారి దగ్గరో, బాబాయిల దగ్గరో హాయిగా ఉండొచ్చు కదా!" సుందరం ఎంత మామూలుగా మాట్లాడదా మనుకున్నా దుఃఖం ఎగదన్నుకొస్తోంది. గొంతు జీరగా ధ్వనిస్తోంది.

"నిజవేఁ బాబూ! పుట్టి, పెరిగిన గడ్డ ఒదిలిపెట్టడం ఆ బాబు కిట్టంలేదు కాబోలు. ఎప్పుడూ గడప దాటలేదు. మడిసి కట్టజీవి. ఉన్న నాలు గెకరాలు అమ్మి కొడుకుల్ని నదివించాడు. అల్ల బాగోగుల కోసవేఁ బతుకు నెల్లదీశాడు. కొడుకులకి రెక్క లొచ్చి ఎగిరిపోయి, కట్టుకున్న ఆడదానికి కాలం సెల్లిపోతే గుండె రాయి సేనుకుని తన గూడులోనే ఉండిపోయేడు. కొన్ని బతుకు లంతే నాయనా!"

మునలయ్య చనిపోయిన చలమయ్య కబుర్లు సానుభూతిగా చెప్పుకుపోతున్నాడు. సుందరం బాధగా, స్వాంతన చెందని హృదయంతో తాత మాటలు నిర్లిప్తంగా వింటున్నాడు. అతని కళ్ళల్లో తాత చిన్నప్పటి రూపమే అస్పష్టంగా కదులుతోంది. సిరివల్లె దగ్గర కొచ్చినట్టుగా దూరంగా ఊరి దీపాలు మినుకు మినుకు మంటూ కనవడసాగాయి. ఎవరో ఇద్దరు మనుషులు మాట్లాడుకుంటూ బండి పక్కగా నడిచి వెళ్ళిపోయారు. రోడ్డు పక్క పొలాల్లోంచి పేరు తెలియని పిట్ట ఏదో కీచు కీచుమంటూ అరుస్తోంది.

సుందరం మనను తాత మరణవార్త జీర్ణించేనుకోలేక మౌన ఘోషతో ఘూర్ణిల్లుతోంది.

ఒంటెద్దు బండి తాత కబుర్లతో తాపీగా ఊరి ముందు శ్మశానం దాటింది. చెరువు పక్కగా నడిచి మలుపు తిరిగింది. శివాలయం వెనుకనుంచి ముందుకు వెళ్ళి సిరివల్లె ఊళ్ళోకి అడుగు పెట్టింది. సిరివల్లె ఊరు చిన్నదే. వీథుల్లో కరెంటు దీపాలు వెలుగుతున్నాయి. చాలావరకు తాటాకు ఇళ్ళే. అక్కడక్కడ పెంకుటి ళ్ళున్నాయి. ఏడు గంటలకే వల్లె నిద్రబోతూన్నట్లుగా ఉంది. వీథుల్లో జనం అలికిడి లేదు. ఇళ్ళల్లో చడీచప్పుడూ లేదు.

ఒంటెద్దు బండి ముందుకు సాగి ఒక వీథిలో చిన్న పెంకుటింటి ముందు ఆగింది. మునలయ్య తాత ముందు బండి దిగాడు. సుందరం చేయి పట్టుకున్నాడు. సూట్‌కేస్ అందుకుని ఆ ఇంటి అరుగుమీద పెట్టాడు.

"బాబూ! ఇదే మీ తాతగా రిల్లు! తవ రీ అరుగుమీద ఒక్క చనం కూకోండి. ఈ ఇంటి తాళం పెశిడెంటు బాబు కాద ఉండిపోయినాది.

# నిరుద్యోగ జీవన గణితము

నిరుద్యోగపు లెక్కల పుస్తకంలో
కలసిరాని కూడిక లనే వట్టాలు,
తరిగిపోని తీసివేతలకే ఇంటర్వ్యూలు.
అప్పుడు తిరగబడుతుంది అతడి
'గుణ'కారం.
భారమౌతుంది ఇంట్లోని భాగా'హారం'.
అప్పులను గీస్తే రేఖాచిత్రం అది
అవుతుంది
అంతులేని ఊహాచిత్రం.


*


ఆదాయం ఋణ సమితిలోనికి
వ్యయం ధనసమితిలోనికి పోతుంటే
అతడు మాత్రం అందరి ముందు
తటస్థం
అవుతున్నాడు అవిచ్ఛిన్న ప్రమేయంగా
అప్పులు, వడ్డీలు అతడి వృత్తపరిధిని
ఎప్పుడో దాటిపోయాయి. మారని అతని
జీవితం, సుఖం కోసం స్క్వేరులలో కాదు
'టు ద పవర్ హాఫ్' ఎంతో తెలియక
బోల్తా కొడుతున్నాయి కలలో కూడా.

*

అతడికి పనికిరాని త్రికోణమితి
ఏ కోణంలో చూసినా పోతోంది 'మతి'.
అతను చేసిన అవకలనాలు ఎందుకూ
ఉపయోగపడక వస్తున్నాయి అతడికి
'అవలింతలు'.
ఆల్ జీబ్రా తీరుస్తుందా అతడి గుండె
గాభరా,
కడుపు మండుతోంది కరకర.
అర్థం కాని 'జీవన గణితం' ఇది ఓ
నిరుద్యోగుని
గుణ గణితం.

- పవన్‌కుమార్ భట్టిప్రోలు






ఎల్లి వట్టుకొత్తను." మునలయ్య హడావుడిగా నడిచి మరో వీధిలోకి వెళ్ళిపోయాడు. సుందరం అయోమయంగా అరుగుమీద కూర్చుండిపోయాడు. వీధంతా నిర్మానుష్యంగా ఉంది. వీధి చివరగా స్తంభానికి వేలాడుతూ విద్యుద్దీపం వెలుగుతోంది.

తాతగారు ఒంటరిగా రోజులు వెళ్ళబుచ్చిన ఆ ఇంటి అరుగుమీద తను కూర్చున్నాడు - అనుకోగానే సుందరానికి ఒళ్ళు పులకరించినట్లయింది. వెంటనే తాతయ్య చనిపోయిన వైనం గుర్తుకు రాగానే ఆ పులకరింపు జలదరింపుగా మారింది.

నిముషాలు భయంగా... భారంగా గడుస్తున్నాయి. బండి మునలయ్య ఇంకా రాలేదు.

"ఎవ రా అరుగుమీద? ఎవరు బాబూ?" చీకట్లోంచి వినవడ్డ ఆ గంభీర స్వరానికి సుందరం త్రుళ్ళిపడ్డాడు.

"నేను చలమయ్యగారి మనవడ్నండీ! హైదరాబాదు నుంచి వచ్చాను. తాతగారు పోయారని బండి తాత చెప్పేవరకూ..." సుందరం చటుక్కున నిలబడి విచారంగా సమాధానం చెప్పాడు. చీకట్లో ఎదురుగా నిలబడ్డ ఆ ఆకారం ఎవరో సుందరానికి అర్థం కాలేదు.

"కూర్చో బాబూ... కూర్చో! నే నీ ఊరుకి కరణాన్ని పోస్టు మాస్టర్ని స్కూలు టీచర్ని కూడా! మీ తాత పోవడం ఏమిటోయ్? ఆ తాత బండిలోనే కదా నువ్వు ప్రయాణం చేసి వచ్చిందీ! ఈ ఒంటెద్దు బండి మీ తాతదే!"

సుందరం చకితుడై శిలా సదృశ్యంగా ఉండిపోయాడు. అతని నోట మాట లేదు. ఆశ్చర్యం... ఆనందం... ఆవేదన... అయోమయం...

ఒంటెద్దు బండి మనిషి తన చలమయ్య తాతగారా! ఎందు కాయన తను చనిపోయినట్టుగా అబద్ధం చెప్పారు? ఎందుకు తనను ఏడిపించారు?

"మీ చలమయ్య తాత పిచ్చివాడయ్యా! తాను చావు బ్రతుకుల్లో ఉన్నట్టుగా నా చేత అందరికీ టెలిగ్రాము లిప్పించాడు. తండ్రి చచ్చిపోయే స్థితిలో ఉన్నాడంటే కొడుకులు తప్పనిసరిగా బయలుదేరి వస్తారని వాడి ఆశ. ఆ రకంగా కొడుకుల్ని కళ్ళ చూడాలని వాడి కోరికానూ! కానీ ఏం జరిగిందో చూశావా! వారం రోజులయి టెలిగ్రాము లిచ్చినా ఒక్క కొడుకూ వత్త లేదు. నిజంగా మీ తాత కన్ను మూసినా అంతే కదా! ఎక్కడికో ఎందుకు? మీ తాతని నువ్వూ, నిన్ను మీ తాత గుర్తుపట్టలేని స్థితిలో ఉన్నారంటే, ఇక అనుబంధాలకీ, ఆత్మీయతలకీ అర్థం ఎక్కడుందయ్యా? ఆ బంధాలన్నీ పరుగెట్టే ఈ యాంత్రిక నాగరిక జీవనంలో గాలికి కొట్టుకుపోతున్నట్టే కదూ?

మీ తాత నెలకి నాలుగో మూడో ఉత్తరాలు నాచేత రాయిస్తుంటాడు. ఒక్క కొడుకూ జవాబివ్వడు. కనీసం సంవత్సరాని కొక్కసారయినా వచ్చి కన్న తండ్రిని పలకరించరు. అయినా మీ తాత ఆశ చావదు. ఆప్యాయత తరగదు. చాదస్తం తగ్గదు. చలమయ్య ఒంటెద్దు బండి నడుపుతున్నాడని తెలిసీ మీ నాన్నకీ, బాబాయిలకీ చిన్నతనంగా ఉందట! ఏం జేస్తాడు పాపం? ఒక ఎకరం భూమిని ఒళ్ళు కరిగించి నాలు గెకరాలు చేసి, ఆ నాలు గెకరాలు కొడుకుల చదువులకోసం అమ్మివడేసి వాళ్ళని నిచ్చె నెక్కించి, తను ఒంటరివా డయ్యాడు. ఒంటెద్దు బండివా డయ్యాడు. అక్కడికీ అనేకసార్లు చెప్పాను. కొడుకులు పెద్ద ఉద్యోగాల్లో ఉన్నారు. ఏ కొడుకు దగ్గర ఉన్నా నీకు కాలం చెల్లిపోతుందనీ! చెబితే వింటేగా! నా రెక్కలమీద బ్రతికే తృప్తి, ఆనందం - ఒకళ్ళమీద ఆధారపడితే దొరుకుతుందా అంటాడు. అయినా కొడుకులే మనవాళ్ళు కానప్పుడు. మరో ఇంటినుంచి వచ్చిన కోడళ్ళు మనవా ళ్ళవుతా రా అంటాడు. వాడికి ఏం చెప్పగలం? సరే బాబూ! నీ పే రేమిటో గానీ, నువ్వయినా మీ తాత దగ్గర నాలుగు రోజు లుండి వెళ్ళు. వస్తానూ...!" కరణంగారు చీకట్లో అడుగులు వేస్తూ ముందుకు వెళ్ళిపోయారు.

సుందరం నరనరాల్లో చెప్పలేని ఉద్వేగం. నిర్వచింపలేని భావ పరంపర. చలమయ్య తాత వ్యక్తిత్వం, వాత్సల్యం అతని మస్తిష్కానికి కొత్త ఉత్తేజా న్నిస్తున్నాయి. అమృతపు జల్లేదో తనపై కురుస్తున్నట్టుగా ఉంది.

"రా బాబూ! ఇంటి తాళం తీశాను. నీ కోసం అరటిపళ్ళు తెచ్చాను. ఈ పూటకి సరిపెట్టుకో!" ఎప్పు డొచ్చాడో చలమయ్య తాత ఇంటి తాళం తీసి గుమ్మం దగ్గర నిలబడ్డాడు. సుందరంఒక్క ఉదుటున చలమయ్య తాతను చుట్టేశాడు.

"తాతగారూ! న న్నిక ఏడిపించకండి. కరణంగారు నా కంతా చెప్పారు. బ్రతికుండీ చనిపోయినట్టుగా నాతో అబద్ధం ఆడటం మీకు న్యాయంగా ఉందా?" సుందరం ఉక్రోషంతో వెక్కి వెక్కి పడుతూ అన్నాడు.

"ఒంటెద్దు బండి నడుపుకునే ఈ మునలి తాత... నీ తాతగారని తెలిసిపోతే ఎనక్కెల్లిపోతావని పారబడ్డాను బాబూ!" చలమయ్య మనవడ్ని మరింత ఆర్తిగా తనవైపు హత్తుకున్నాడు.

"తాతగారూ! నేను మిమ్మల్ని వదిలి వెళ్ళను. ఇకనుంచి మీరు ఒంటరి కాదు. నేను మీతోనే ఉండిపోతాను. నాన్నకు, బాబాయిలకి బుద్ధొచ్చేలా చేస్తాను."

సుందరం మాటలకి చలమయ్య బదులు చెప్పలేదు. కానీ ఇంటి బయట నిలబడ్డ ఒంటెద్దు [బండి] మెడలో గంట మాత్రం గణ గణ మని మోగింది. ★

